క్లుప్తంగా

10వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోండి

గూడూరు: పింఛన్‌దారులు ఈ నెల 10వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఎం బాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఆధార్‌కార్డు, లింక్ అయిన ఫోన్ నంబర్‌తో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఇప్పటివరకూ ఈకేవైసీ చేయించుకోని వారు మాత్రమే చేసుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా వాసవీమాత హోమం



మహామేరువుకు అభిషేకం చేస్తున్న అర్చకులు

గూడూరు: స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం 102 హోమ గుండాలు ఏర్పాటు చేసి, 204 జంటలతో వాసవీమాత హోమం వైభవంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి పూజలు చేశారు. అ లాగే శ్రీచక్ర మేరువుకు పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి, గర్భగుడిలో ప్ర తిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలో రెండు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎంపీడీఓ స్వరూపరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గొట్టికాడు, వెంగమాంబపురం సచివాలయం పరిధిలో ఒక్కొక్క వలంటీర్ పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

సైదాపురం: దోమలు నివారణకు ప్రతి ఒక్కరు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారి జనార్దన్‌రావు కోరారు. సైదాపురం ఎస్టీ, ఎస్సీ కాలనీల్లో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి మురుగునీరు నిల్వ చేరకుండా జాగ్రత్త చర్యలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న ఈఓపీఆర్డీ

చిల్లకూరు: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, మెరుగు పరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఈఓపీఆర్డీ మాణిక్యం తెలిపారు. మండలంలోని ఓడూరులో శుక్రవారం పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టారు. ఆయన వెంట ఓడూరు సర్పంచ్ నాగిశెట్టి శారదమ్మ, కార్యదర్శి జమీర్‌బాషా ఉన్నారు.

మానసదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు


నాయుడుపేటటౌన్: పట్టణంలోని అగ్రహారపేటలో ఉన్న మానసదేవి(నాగమాసాలమ్మ) ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు, విశేషాలంకరణ, పూజలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలకు కువ్వాకుల శ్రీనివాసులు, వైష్ణవి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చలంబేటి వాసు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గా మల్లేశ్వరి దేవి ఆలయంలో..

తిమ్మాజికండ్రిగ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వర దేవి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పల్లకి సేవ జరిపారు.

శరవేగంగా అండర్ బ్రిడ్జి పనులు

దొరవారిసత్రం: మండల కేంద్రంలో రైల్వే అండర్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. త్వరలోనే ఈ బ్రిడ్జి ప్రారంభం కానుంది. ఇక్కడ ఉన్న 71 రైల్వే గేటును కూడా రైల్వే అధికారులు తొలగించనున్నారు. ఈ ప్రాంతంలో రైలు పట్టాలు వేసిన సమయంలో సుమారు 70 ఏళ్ల కిందట ఈ గేటు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రజలు ఈ గేటు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ పెరిగిన నేపథ్యంలో అండర్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. అలాగే మండలంలోని పోలిరెడ్డిపాళెం, మేలుపాక, పోలిరెడ్డిపాళెం రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న అండర్ బ్రిడ్జిల పనులు 90 శాతం వరకు పూర్తి చేశారు.



డీవీ సత్రంలో నిర్మిస్తున్న అండర్ బ్రిడ్జి

త్రినేత్రం.. సురక్షితం

కొత్త పుంతలు తొక్కుతున్న నేరాలు.. అప్రమత్తంగా వ్యవహరిస్తున్న నేరస్తులు.. అరాచక కార్యకలాపాల్లో ఆధారాలు దొరక్కుండా జాగ్రత వహిస్తున్న నేరగాళ్లు.. పోలీసులకు కంటిమీద కునుకు కరువు.. గూడూరు ప్రజలు ఇవన్నీ నిత్యం వింటున్నారు.. చూస్తున్నారు. ముల్లును ముల్లుతోనే తీయాలన్న చందంగా ఈ నేరాలను ఛేదించేందుకు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఓ పోలీసు ఉన్నతాధికారి ఆధునిక సాంకేతికత ను అందిపుచ్చుకోవాలని తలచారు. పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే పోలీసుల చేతిలో బ్రహ్మాస్త్రంలా మారనున్నాయి.

- సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు
- నేరాల నియంత్రణలో కీలకం



సీసీ కెమెరాల ఏర్పాటుకు టెక్నికల్ టీమ్‌తో ప్రధాన కూడళ్లను పరిశీలిస్తున్న డీఎస్పీ (ఫైల్)

గూడూరు: సురక్షిత పట్టణంగా తీర్చిదిద్దడంలో భాగంగా గూడూరులోని పలు కూడళ్లలో గతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే అవి సరిగా పనిచేసిన దాఖలా లేదు. దీంతో ఎక్కడ ఏ నేరం జరిగినా కూడా తెలుసుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఇటీవల డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణరెడ్డి నాలుగు రోజుల క్రితం జాతీయ రహదారి కూడలి, ఆ రహదారి వెంబడి ఉన్న కూడళ్లలో, పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే దిశగా కార్యచరణ రూపొందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీన ఆయన టెక్నికల్ టీమ్‌తోపాటు, ఒకటి, రెండో పట్టణ సీఐలతో కలసి పట్టణంలోని పలు కూడళ్లను పరిశీలించారు. సీసీ కెమెరాలను ఏ ప్రాంతంలో అమర్చితే, అన్ని వైపులా కవర్ అవుతుందన్న విషయాలపై ఆయన టెక్నికల్ టీమ్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పట్టణంలోని ప్రధాన వ్యాపార ప్రాంతాల్లో, ఆయా దుకాణ యజమానులను కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ క్రమంలోనే త్వరలో తమ సబ్ డివిజన్ పరిధిలోని వెంకటగిరి, కోట తదితర ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే దిశగా ఆయన చర్యలు తీసుకుంటున్నారు. ఇలా పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే, పోలీసులకు పలు నేరాలకు సంబంధించిన కేసుల్లోనూ, ఇతర సంఘటనల్లోనూ సమాచారం లభిస్తుంది. దీంతో కేసుల దర్యాప్తులో సీసీ ఫుటేజీ కీలక భూమిక పోషించనుంది.

మున్సిపాలిటీకి సాంకేతిక రక్ష

పట్టణంలో సుమారు 98 వేల జనాభా ఉన్నారు. వారందరికీ రక్షణ కల్పించాలంటే ఉన్న పోలీసులు సరిపోరు. ముఖ్యంగా తీర ప్రాంత పట్టణం కావడంతోపాటు గొలుసు చోరీలు, దొంగతనాలు, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయి. ఒక కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే అవి 24 గంటలూ నిఘా పెడతాయి. ఏమి జరుగుతుందన్న విషయాన్ని రికార్డు చేస్తాయి. ఫలితంగా నేరాల నియంత్రణలో పోలీసులకు కీలకభూమిక పోషిస్తాయి.

చర్యలు వేగవంతం చేస్తున్నాం



ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పలు కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. దీంతో చాలా వరకూ నేరాలకు సంబంధించి, కొంత సమాచారం లభిస్తుంది, ముఖ్యంగా ప్రధాన వీధుల్లోని దుకాణ యజమానులే కాకుండా, అక్కడక్క డా ఇళ్ల ముంగిళ్లలో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, గూడూరు

రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన ఉన్నతాధికారులు



డీవీ సత్రంలో రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనుల వివరాలను తెలుసుకుంటున్న పీసీఎస్‌టీఈ సెల్వదొరై

దొరవారిసత్రం: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌ను శుక్రవారం ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నిల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్(పీసీఎస్‌టీఈ) సెల్వదొరై, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. సిగ్నల్ ఇంటర్ లాకింగ్ సిస్టమ్ పనులపై ఆరా తీశారు. అదే విధంగా స్టేషన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. కొత్త పరిజ్ఞానంతో నిర్మాణంలో నూతన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ సీఎస్‌టీఈ మురళీకృష్ణా, డీఎస్‌టీఈ కార్తీ, ఏడీ చిదంబరం ఉన్నారు.

పనులు వేగవంతం చేయండి



కలిచేడు లేఅవుట్‌ను పరిశీలిస్తున్న డీఈ

సైదాపురం: పక్కా గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సర్వేపల్లి సబ్ డివిజన్ డీఈ వరప్రసాద్ కోరారు. మండలంలోని కలిచేడులో జగనన్న లేఅవుట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కొక్క పక్కా గృహానికి రూ.2.15 లక్షల నిధులను మంజూరు చేస్తుందన్నారు. ఇందులో ప్రభుత్వం రూ.1.50 లక్షలు కాగా, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.30 వేలు, అలాగే పొదుపు ద్వారా మరో రూ.35 వేలు కలిపి మొత్తం రూ.2.15 లక్షలు విడుదల చేస్తుందన్నారు. పక్కా గృహాలు మంజూరైన వారు వెంటనే పనులను ప్రారంభించాలన్నారు. ఆయన వెంట ఏఈ భాస్కర్‌రావు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



గూడూరు: మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ భూదరు గురవయ్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కనీసం సచివాలయాల్లోనైనా అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు ఏదైనా అడిగితే కనీస సమాధానం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని తెలిపారు. ఇలాగే కొనసాగితే జిల్లా కలెక్టర్‌కు సంబంధిత అధికారులపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్ మాట్లాడుతూ జలజీవన్‌మిషన కింద ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యం కల్పించేలా పనులు చేపడుతున్నామ చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ లీలారాణి, ఈఓపీఆర్‌డీ రవీంద్రబాబు, వైస్ ఎంపీపీ ఇంద్రాణి, ఎంఈఓ దేవరాజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయ ఆవరణలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు, అధికారులు, నాయకులు

నాయుడుపేటటౌన్: గ్రామదేవత పోలేరమ్మ జాతరను పురస్కరించుకుని శుక్రవారం ఆలయ సమీపంలో అన్నదానం చేశారు. ముందుగా పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. పెసల జయబాబు జ్ఞాపకార్థం ఆయన సోదరులు కిషోర్‌బాబు, రమేష్‌బాబు, కుమారుడు పెసల రాజాబాబు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గంధవల్లి సిద్ధయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఈఓ శాంతరావు, ఆర్యవైశ్య సంఘం రూరల్‌జిల్లా అధ్యక్షుడు కనమర్లపూడి సుబ్రమణి, వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధిలింగం రాజేష్, చదలవాడ కుమార్, జీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి: ఏపీ మోడల్‌స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 9వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆ పాఠశాల ప్రిన్స్‌పల్ తులసిజ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 11వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్హత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు apms.ap.gov.in లేదా www.cse.ap.in వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

మావిళ్లపాడులో..

దొరవారిసత్రం: మావిళ్లపాడులోని ఆదర్శపాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికిగాను ఆరో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ఈ నెల 9 నుంచి 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్స్‌పల్ సీహెచ్ సుమలత తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అయితే రూ.75, ఓసీ, బీసీ విద్యార్థులు అయితే రూ.150 రుసుం చెల్లించాలన్నారు. వివరాలకు 70329 96508, 95020 97754 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పెళ్లకూరు: స్వర్ణముఖినది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను ఎస్ఈబీ పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. ఎస్ఈబీ అధికారుల కథనం మేరకు.. స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో తాళ్వాయిపాడు వద్ద ఇసుక అక్రమ రవాణా వాహనాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న కర్పూరం చలపతికి చెందిన ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్‌తో పాటు డ్రైవర్ శేఖర్ బాబును అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది సురేష్, రమణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్టు



పేకాటరాయుళ్ల అరెస్టు చూపుతున్న ఎస్ఐ జిలాని

వెంకటగిరి: స్థానిక ఎన్‌టీఆర్ కాలనీలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో శుక్రవారం ఎస్ఐ ఎస్కే జిలానీ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి, 8 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ.15,030 నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేదరిక నిర్మూలనకే సంక్షేమ పథకాలు



సూళ్లూరుపేట: లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: పేదరిక నిర్మూలకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శుక్రవారం సూళ్లూరుపేట మున్సిపాలిటీలో ఏడో వార్డు కౌన్సిలర్ సన్నారెడ్డి సౌజన్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని సంజీవయ్యనగర్, కాపువీధి, పోస్టాఫీస్ వీధి, రైల్వేస్టేషన్ రోడ్డు, బొగ్గుల కాలనీలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అందాయా? లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజీ రోడ్డు దారుణంగా ఉందని, ఈ రోడ్డును వేస్తే ఈ ప్రాంతమంతా బాగుంటుందని స్థానికులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటికి విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగనన్నను, ఎమ్మెల్యేగా తనని మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కమిషనర్ ఎన్ నరేంద్రకుమార్, ఎంపీపీ అల్లూరు అనిల్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పోలూరు పద్మా మిల్టన్, చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్లు మీజూరు రామకృష్ణారెడ్డి, పముజుల విజయలక్ష్మి, ఊటి మునీంద్రబాబు, పోన్నా మునిప్రసాద్, ముత్తుకూరు లక్ష్మమ్మ, కోఆప్షన్ సభ్యుడు కాళహస్తి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

దొరవారిసత్రం: మేలనాలత్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నూతలపాటి రాధాకృష్ణనాయుడిని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. రాధాకృష్ణనాయుడు తనయుడు ధనుష్(26) మూడురోజుల కిందట బెంగళూరులో ఆత్మహత్య పాల్పడ్డాడు. అతడి మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరుకుంది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి ఆ గ్రామానికి వెళ్లి ధనుష్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుంటుబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఈశ్వరవాక శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుబ్రమణ్యం, సునీల్‌కుమార్ ఉన్నారు.

తీర ప్రాంత గ్రామాల్లో విద్యకు ప్రాధాన్యం



విద్యా సామగ్రి కిట్లు చూపుతున్న చిన్నారులతో పరిశ్రమ ప్రతినిధులు

చిల్లకూరు: తీర ప్రాంత గ్రామాల్లో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని జిందాల్ సింహపురి ఎనర్జీ ప్రైవేట్ లిమిటడ్‌ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని వరగలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తీర ప్రాంత గ్రామాలైన మోమిడి, వరగలి, మన్నెగుంట, తమ్మినపట్నం, గుమ్మళ్ల దిబ్బ గ్రామాల్లోని సుమారు 200 మంది పిల్లలకు ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల తీర ప్రాంత గ్రామాల్లో పరిశ్రమ సీఎస్ఆర్ కింద చదువుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో తొలి అడుగుగా 200 మంది విద్యార్థులకు నెల రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటుగా వారికి అల్పాహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందుకు వచ్చిన హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం, రేస్ కరస్పాండెంట్ బాలచెన్నయ్యలను అభినందించారు. విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్లను అందజేశారు. అలాగే ఈ కార్యక్రమం నిర్వహించేందుకు రేస్ స్కూల్ ఉపాధ్యాయులు, సేవ్ ది చిల్డ్రన్ సంస్థ, చేయూత సేవా సంస్థలు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు బండి మాధవి, ఇరగరాజు ఏడుకొండలు, నెల్లిపూడి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు దార కోటేశ్వరరావు, పరిశ్రమ సీఎస్ఆర్ హెడ్ మాథ్యూ, ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



మాంగల్యం చూపుతున్న వేద పండితులు

చిల్లకూరు: లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజున స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మండలంలోని కలవకొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి అమ్మవార్లకు విశేషాలంకరణ చేసి, కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చారు. అనంతరం వేద మంత్రోచ్చారణల నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణానికి ఆలయ మాజీ చైర్మన్ కందల ప్రకాశరావు, సరోజనమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు. చెన్నైకు చెందిన బేరిశెట్టు అన్నాడిశెట్టి సుబ్రహ్మణ్యం శెట్టి, కృష్ణయ్యశెట్టి సుభోషెట్టి గురునాథం, లోకనాథం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారికి గజవాహన సేవ నిర్వహించారు. వాహనసేవకు వరిదిరెడ్డి రామమోహన్‌రెడ్డి, యల్లంటి ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సీవన్‌కుమార్, గూడూరు మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, ఆలయ చైర్మన్ ఆనందబాబు, ఏఎంసీ చైర్‌పర్సన్ ఓడూరు యమునమ్మ, మాజీ చైర్మన్ యరటపల్లి జానికిరామిరెడ్డి, కోదండరామస్వామి ఆలయ మాజీ చైర్మన్ యరటపల్లి శరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

15 నిమిషాల్లో రేషన్‌కార్డు జారీ



విద్యార్థినికి రేషన్‌కార్డు అందజేస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

చిల్లకూరు: ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం కోసం ఓ విద్యార్థిని ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ 15 నిమిషాల్లో రేషన్‌కార్డు జారీ చేశారు. చిల్లకూరుకు చెందిన హర్షిణిరెడ్డి సెప్టెంబర్‌లో రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకుంది. అయితే కార్డు రావడం ఆలస్యం కావడంతో ఆమె తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ వద్దకు వెళ్లి, తన సమస్యను వివరించింది. దీనిపై స్పందించిన ఆయన విద్యార్థిని చదువునకు సమయం వృథా కాకూడదని ఉన్నతాధికారులతో చర్చించి, వీఆర్వో రమణయ్య, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు శివకుమార్, కిరణ్మయి, వెంకటరమణతో మాట్లాడి బాధిత విద్యార్థినికి రేషన్‌కార్డు మంజూరు చేసేలా చర్యలు చేపట్టారు. దీంతో 15 నిమషాలలో కార్డును ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసి విద్యార్థినికి ఎస్ఐ గోపాల్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య, ఆర్ఐ రమ్యస్వాతి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

పెళ్లకూరు: మండలంలోని నెలబల్లిలో శుక్రవారం పాండురంగస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు కలశపూజ, మహాహోమం నిర్వహించి, అగ్నిగుండం సిద్ధం చేశారు. కంకణధారణ చేసిన భక్తులు తొమ్మిది జలాశయాల్లో స్నానాలు ఆచరించి, భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బియ్యపు గోవిందురెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సుందరరామిరెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీదేవి, గోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో మోస్తరు వర్షం





గూడూరులో కురుస్తున్న వర్షం, అలఘునాథ స్వామి ఆలయ సమీపంలో కూలిన చెట్టు, సైదాపురంలో కురుస్తున్న వర్షం

గూడూరు: పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో అలఘునాథస్వామి ఆలయ సమీపంలోని ఓ పెద్ద వృక్షం నేలకొరిగింది. చెట్టు కూలిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో ఆ ప్రాంతవాసులు భయాందోళన చెందారు. వర్షం కారణంగా జన జీవనం స్తంభించింది.

సైదాపురంలో..

సైదాపురం: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా నిమ్మతోటల్లో కాయలు బాగా వస్తాయని నిమ్మ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చిట్టమూరులో చిరుజల్లులు

చిట్టమూరు: మండలంలో శుక్రవారం సాయంత్రం పలు గ్రామాల్లో చిరుజల్లులు పడ్డాయి. మధ్యాహ్నం వాతావరణం చల్లపడి వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎల్లసిరి, ఈశ్వరవాక, మెట్టు, చిట్టమూరు, గునపాడు, గునపాటిపాళెం, తిమ్మారెడ్డివాగు గ్రామాల్లో రైతులు వరినార్లు పోసి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో వర్షాలు పడుతుండడంతో వరి నాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.